

నిలువ లేక.. నీరసించి

పని ప్రదేశాల్లో నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి హామీ పథకం కూలీలు గగ్గోలు పెడుతున్నారు. 8లో▸



పేదల సంక్షేమమే లక్ష్యం

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸



సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు ధారూరుకు చేవెళ్ల ఎంపీ కొండా రాక

ధారూరు: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శుక్రవారం మండలంలో పర్యటించనున్నట్లు బీజేపీ వికారాబాద్ అసెంబ్లీ కో ఆర్డినేటర్ వడ్ల నందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులు, ఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని నాగారం, స్టేషన్‌ధారూరు, ధారూరు, రుద్రారం, అల్లీపూర్ గ్రామాల్లో పర్యటిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కలెక్టరేట్ గదిలో మంటలు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అనంతగిరి: వికారాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయంలో గురువారం సాయంత్రం టీ ఫైబర్ రూమ్‌లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. సిబ్బంది వెళ్లి చూడగా యూపీఎస్, బ్యాటరీలు కాలిపోవడంతో మంటలు చెలరేగినట్లు గుర్తించారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు ఆర్పేశారు. అయితే సాయంత్రం వీచిన ఈదురు గాలుల కారణంగా కరెంటు పలుమార్లు వచ్చిపోవడంతోనే ఇలా జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. కలెక్టరేట్ నెట్‌కు, కరెంట్‌కు ఎలాంటి సమస్య తలెత్తలేదు. ప్రమాదం జరిగిన సమయంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆఫీసులోనే ఉండటంతో సదరు గదిని పరిశీలించారు.

ఇక తూకమే..

జిల్లాలో ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

- 15నుంచి ప్రక్రియను ప్రారంభించాలని అధికారుల నిర్ణయం
- ప్రస్తుత సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం 92వేల ఎకరాలు
- 2.25లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- లక్ష మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యం



వికారాబాద్: యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణకు అధికారులు సిద్ధమయ్యారు. ఇతర జిల్లాల్లో ఇప్పటికే కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాగా మన జిల్లాలో ఇంకా మొదలు కాలేదు. మిగతా జిల్లాలతో పోలిస్తే మన ప్రాంతంలో నెల నుంచి నెలా 15 రోజులు ఆలస్యంగా వరి నాట్లు వేశారు. ఈ కారణంగానే పంట కాస్త ఆలస్యం అవుతోంది. జిల్లాలో ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత సీజన్‌లో 92వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. 2.25లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా లక్ష మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 128 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 11 కేంద్రాల ద్వారా సన్నరకం వడ్లు సేకరించనున్నారు. వరి కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

గత అనుభవాల నేపథ్యంలో..

గత యాసంగి సీజన్ ధాన్యం సేకరణలో ఎదురైన సమస్యలు, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది సెర్ప్, మార్కెట్ కమిటీ, పీఏసీఎస్, డీసీఎమ్మెస్‌ల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎక్కువ శాతం ధాన్యాన్ని సెర్ప్ ద్వారా సేకరించారు. రెండు పర్యాయాలుగా కేంద్రాల ఏర్పాటుకు గ్రామైక్య సంఘాలు ఆసక్తి చూపడం లేదు. గత సీజన్‌లో బ్యాగుకు కిలో రెండొందల గ్రాములు తరుగు తీశారు. రైస్ మిల్లర్లు ఐదు నుంచి ఏడు కిలోల తరుగు తీశారు. దీంతో గ్రామ సంఘాల సభ్యులు ఇబ్బందులు పడ్డారు. తరుగు కారణంగా కొన్ని కేంద్రాల్లో నష్టాలు సైతం వచ్చాయి. ఈ కారణంగానే వారు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు వారితో మాట్లాడేందుకు ముందుకు వచ్చారు. ఐకేపీ ఆధ్వర్యంలో 41 కొనుగోలు కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా 49, డీసీఎమ్మెస్ ద్వారా 38, మొత్తం 128 కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. గతంలో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వకు స్థల సమస్యలు ఎదురయ్యాయి. ఈ సారి అలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచారు.

గ్రేడ్ ఏ ధాన్యానికి రూ.2,300

ఈ ఏడాది 92వేల ఎకరాల్లో వరి పంట వేశారు. ఎకరాకు సగటున 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో 2.25లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ చెబుతోంది. దాదాపు లక్ష మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉండటంతో ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 రైతులకు మద్దతు ధర ఇవ్వాలని నిర్ణయించారు.

పకడ్బందీ చర్యలు

అనంతగిరి: జిల్లాలో ధాన్యం సేకరణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, డీసీఎంఎస్, సీఈఓలు, ఏపీఎంలు, సీసీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. 128 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 11 కేంద్రాల ద్వారా సన్న రకం వడ్లు, 117 కేంద్రాల ద్వారా దొడ్డు రకాలు కొనుగోలు చేయనున్నట్లు వివరించారు. 90వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వరి, 10వేల మెట్రిక్ టన్నుల సన్న రకం వడ్లు వస్తాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం సేకరణకు ఐకేపీ సెంటర్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి కేంద్రం వద్ద ధరలు, తేమ శాతం తెలిపే ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్యాడీ క్లీనింగ్ యంత్రాలు, తేమ శాతం కొలిచే పరికరాలు, తాగునీరు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్ఓ మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ డీఎం వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



ఆస్పత్రికి వచ్చిన గర్భిణి రిపోర్టులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

మహిళల ఆరోగ్యమే లక్ష్యం

కలెక్టర్ ప్రతీక్‌జైన్

ధారూరు: గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారికి అవసరమైన మందులు, ఇంజెక్షన్లు సకాలంలో ఇవ్వాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. గురువారం మండలంలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు తీసుకెళ్లే మాత్రలు తప్పనిసరిగ్గా వాడేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు వారిని ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ ఉండాలన్నారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన గర్భిణుల స్కానింగ్ రిపోర్టులను పరిశీలించారు. స్కానింగ్ ఇక్కడే చేస్తున్నారా అని డాక్టర్‌ను ప్రశ్నించగా తాండూరు, వికారాబాద్ పట్టణాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకు పంపుతున్నట్లు తెలిపారు. విధులకు సక్రమంగా రావాలని డాక్టర్, సిబ్బందికి సూచించారు.

ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

అనంతగిరి: వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో విద్యుత్ మరమ్మతులతోపాటు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్, ఇతర సామగ్రిని తొలగించాలని ఆదేశించారు. ఫ్యాన్లు సమకూర్చుకోవాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సదరం క్యాంప్‌ను పరిశీలించి సౌకర్యాలు సమకూర్చుకోవాలని డీఆర్డీఓ శ్రీనివాస్‌కు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీఓ వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బంట్వారం కేజీబీవీ సందర్శన

బంట్వారం: స్థానిక కేజీబీవీ వసతి గృహాన్ని గురువారం కలెక్టర్ ప్రతీక్ జైన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. బాగా చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అర్హులకు అందేలా చొరవ చూపాలన్నారు. అనంతరం గ్రామంలోని రేషన్ దుకాణాన్ని సందర్శించి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీఓ నాగరాజు, డాక్టర్ మజీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలు చేయాల్సిందే

మర్పల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. గురువారం మర్పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, బీసీ బాలుర వసతి గృహం, పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీఓ లక్ష్మీకాంత్, ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి నర్సింగ్‌రావు, డాక్టర్ మానస తదితరులు పాల్గొన్నారు.



నారెగూడలో టీచర్లు రాకపోవడంతో బయట ఆడుకుంటున్న విద్యార్థులు

25 మంది విద్యార్థులు | 12 మంది టీచర్లు

నారెగూడ, చిట్టిగిద్ద హైస్కూళ్ల పనితీరు అధ్వానం

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య.. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం.. మధ్యాహ్న భోజనం.. వేదికలెక్కిన ప్రతిసారీ పాలకులు, అధికారులు చెప్పే మాటలు.. కానీ నవాబుపేట మండలం నారెగూడ, చిట్టిగిద్ద ఉన్నత పాఠశాలల్లో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.

- సమయపాలన పాటించని ఉపాధ్యాయులు
- ఏటా తగ్గుతున్న ఉత్తీర్ణత, స్టూడెంట్ల సంఖ్య
- పట్టించుకోని విద్యాశాఖ ఉన్నతాధికారులు

నవాబుపేట: మండలంలోని నారెగూడ, చిట్టిగిద్ద ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. పిల్లల చదువుపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.. ఇక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. ఏటా ఉత్తీర్ణత శాతం తగ్గుతుండటంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్నారు. బుధవారం ఉదయం 8గంటలకు నారెగూడ పాఠశాలను పరిశీలించగా విద్యార్థులు బయట ఆడుకుంటూ కనిపించారు. అరగంట ఆలస్యంగా ఉపాధ్యాయులు వచ్చారు. వీరికి ఇది నిత్య కృత్యమేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు టీచర్లను నిలదీసినా వారిలో మార్పు రావడం లేదంటున్నారు.

చిట్టిగిద్దలో మరీ దారుణం

మండల విద్యాధికారి పని చేసే చిట్టిగిద్ద ఉన్నత పాఠశాలలో గతేడాది, ఈసారి పదో తరగతిలో ఒక్క విద్యార్థి కూడా లేకపోవడం గమనార్హం. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 12 మంది విద్యార్థులు ఉండగా.. 6వ తరగతిలో ఇద్దరు విద్యార్థులు, 7వ తరగతిలో ఇద్దరు, 8వ తరగతిలో ముగ్గురు, 9వ తరగతిలో 5 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇక్కడ కూడా 6 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. సిబ్బంది, హెచ్‌ఎం (మండల విద్యాధికారి) విధులకు సక్రమంగా రావడం లేదనే స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠాలు సరిగ్గా చెప్పకపోవడం వల్లే తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

సింగిల్ డిజిట్‌కే పరిమితం

గత ఏడాది నారెగూడ ఉన్నత పాఠశాలలో 18 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరిలో 6గురు పదో తరగతి విద్యార్థులు ఉండగా.. ఒక్కరే పాస్ అయ్యారు. ప్రస్తుత విద్యా సంవత్సరం స్కూల్ మొత్తంగా ఆరు నుంచి పదో తరగతి వరకు కేవలం 13 మంది విద్యార్థులే ఉన్నారు. 6వ తరగతిలో ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. 7వ తరగతిలో 6గురు, 8వ తరగతిలో ఒక్కరు, 9వ తరగతిలో ముగ్గురు, పదో తరగతిలో ముగ్గురు ఉండగా ఇటీవల పరీక్షలు రాశారు. వీరికి పాఠాలు బోధించేందుకు ఆరుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రస్తుత విద్యా సంవత్సరంలో స్కూళ్ల వారీగా విద్యార్థుల సంఖ్య

(6 నుంచి 10వ తరగతి వరకు..)

నవాబుపేటలో	-	108
కేజీబీవీలో	-	257
ఆదర్శ పాఠశాలలో	-	311
పులుమామిడిలో	-	84
ఎల్లకొండలో	-	102
గంగ్యాడలో	-	82
నారెగూడలో	-	13
అక్నాపూర్‌లో	-	23
చించల్‌పేటలో	-	121
చిట్టిగిద్దలో	-	12
ఎక్‌మామిడిలో	-	66
మమ్మదాన్‌పల్లిలో	-	88
మీనపల్లికలాన్‌లో	-	50

ఉత్తీర్ణత అంతంతే..

గత ఏడాది మండల వ్యాప్తంగా 358 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 213 మంది పాసయ్యారు. ఏకంగా 145 మంది ఫెయిల్ అయ్యారు. ఈ ఏడాది 352 మంది పది పరీక్షలు రాశారు. ఎంత మంది పాస్ అవుతారో చూడాలి.

పడిపోతున్న విద్యార్థుల సంఖ్య

మండలంలో 11 జిల్లా పరిషత్ పాఠశాలలు, ఒక ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, జ్యోతిరావ్ పూలె పాఠశాలలు ఉన్నాయి. గతేడాది వీటిలో 1,462 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో 1,317 మంది ఉన్నారు. ఈ సారి 145 మంది విద్యార్థులు తగ్గారు.

సమయపాలన లేదు



చిట్టిగిద్ద ఉన్నత పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు రావడం లేదు. ఎంఈఓ ఇక్కడ పని చేస్తున్నా లాభం లేదు. ఆయనే స్కూల్‌కు సరిగ్గా రాడు. రెండేళ్లుగా పదో తరగతిలో విద్యార్థులు లేరు. గతంలో ఇక్కడ పదో తరగతి పరీక్ష కేంద్రం ఉండేది. ఇప్పుడు పాఠశాల ఉంటుందా అనే అనుమానం తలెత్తుతోంది. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి.

– శాంతకుమార్, చిట్టిగిద్ద

పక్క గ్రామ పాఠశాలకు..



మా గ్రామంలో ఉన్నత పాఠశాల ఉన్నా పిల్లలను పక్క గ్రామానికి పంపుతున్నారు. గత సంవత్సరం ఇక్కడి పాఠశాలలో 7 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తే కేవలం ఒక్కరే పాసయ్యారు. ఉపాధ్యాయులు సరిగ్గా పాఠాలు చెప్పకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. ఈ సారి మొత్తం 13 మంది విద్యార్థులు ఉండగా ముగ్గురు పదో తరగతి పరీక్షలు రాశారు.

– పర్మయ్య, మాజీ సర్పంచ్, నారెగూడ

చర్యలు తీసుకుంటున్నాం



మండలంలో గత ఏడాది పదో తరగతి ఫలితాలు తక్కువగా వచ్చాయి. ఈ సారి మెరుగైన ఫలితాల కోసం చర్యలు తీసుకున్నాం. మంచి ఫలితాలు వస్తాయని భావిస్తున్నాం. విధులకు సక్రమంగా రాని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం. ఎంఈఓ బాధ్యతలు ఉండటంతో తాను పూర్తి స్థాయిలో పాఠశాలకు వెళ్లలేకపోతున్నా. విద్యార్థుల సంఖ్య తగ్గకుండా, ఉత్తీర్ణ పెరిగేలా చూస్తున్నాం.

– అబ్దుల్ రెహమాన్, ఎంఈఓ, నవాబుపేట

ప్రజలకు అందుబాటులో ఉండండి: డీఎంహెచ్‌ఓ

అనంతగిరి: వికారాబాద్ మండలం సిద్దులూర్ పీహెచ్‌సీని గురువారం డీఎంహెచ్‌ఓ వెంకటరవణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

ఈదురు గాలులకు నేలరాలిన మామిడి కాయలు

దోమ: మండల వ్యాప్తంగా గురువారం బలమైన ఈదురుగాలులు వీచాయి. దీంతో మామిడి తోటలకు నష్టం జరిగింది. ఎన్నో కష్టాలు ఎదుర్కొని కాపాడుకుంటున్న మామిడి పంట ఈదురు గాలుల కారణంగా దెబ్బతినిందని రైతులు తెలిపారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, దిగుబడి వచ్చే సమయంలో పంట దెబ్బతినిందని రాకొండ గ్రామానికి చెందిన తలారి భీమయ్య ఆవేదన వ్యక్తం చేశారు.



రాకొండ గ్రామంలో నేలరాలిన మామిడి కాయలు

బాధితులకు న్యాయం చేయాలి



పాల్గొన్న పోలీసు అధికారులు

ఎస్పీ నారాయణరెడ్డి



అనంతగిరి: సైబర్ నేరాలపై ఫిర్యాదులు వస్తే వెంటనే కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. గురువారం వికారాబాద్‌లోని తన కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన కేసులు, వాటి పురోగతి, విచారణ స్థితి, న్యాయపరమైన అంశాలు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేరాలపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, న్యాయస్థానాల్లో సరైన సాక్ష్యాధారాలు సమర్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రతి కేసునూ ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. వీటితో పాటు సాంకేతిక ఆధారాలను సమకూర్చడం, ఫోరెన్సిక్ సహాయాన్ని వినియోగించడం, ప్రత్యక్ష సాక్షులను సమర్థవంతంగా న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టె విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దొంగతనం కేసులను త్వరితగతిన ఛేదించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో దొంగతనాలు, నేరాల నియంత్రణకు సీసీ టీవీల ఏర్పాటు ఎంతో అవసరమని ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పరిగి, వికారాబాద్, తాండూరు డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల పార్టీ బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: భారతీయ జనతా పార్టీ లీడర్ల పార్టీ కాదని, కార్యకర్తల పార్టీ అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పట్టణంలోని బీడీఎల్ చౌరస్తా వద్ద గురువారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన పార్టీ మండల, మున్సిపల్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ఎప్పుడూ ప్రజల శ్రేయస్సు కోసమే ఆలోచిస్తుందని, మిగతా పార్టీల్లా మీడియాలో కనిపించేందుకు ఆసక్తి చూపించదని అన్నారు. కేంద్రం రాష్ట్రానికి ఎన్నో నిధులు కేటాయిస్తున్నప్పటికీ శిలాఫలకాలు వేసుకొని క్రెడిట్ మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుంటోందని విమర్శించారు. కార్యకర్తలు గ్రామస్థాయిలో ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జిలు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాష్, శంకర్‌పల్లి మండల అధ్యక్షురాలు లీలావతి, మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెవెన్యూ గ్రామంగా ప్రకటించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బంట్వారం: మండలంలోని బస్వాపూర్‌ను రెవెన్యూ గ్రామంగా ప్రకటించాలని స్థానిక నాయకులు గురువారం కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను బంట్వారంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ గ్రామంగా బస్వాపూర్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. స్పందించి వెంటనే ప్రకటించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, నర్సింలు, రాములు, పురుషోత్తం ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం



ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న నారాయణరెడ్డి, చిత్రంలో హౌసింగ్ అధికారులు

తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటే ప్రభుత్వం నుంచి బిల్లులు ఇప్పిస్తామని కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పాఠశాల ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంబాపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషితో గ్రామంలో 328 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారని చెప్పారు. ఇంటి నిర్మాణంలో దళారులను నమ్మొద్దని.. ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లిస్తారని చెప్పారు. అనంతరం హౌసింగ్ డీఈఈ ఖలీ మోద్దీన్ మట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనాల ప్రకారం ఇళ్లు కట్టుకుంటే బిల్లులు వస్తాయన్నారు. ఇప్పటి వరకు 21 ఇళ్లకు మార్కింగ్ వేశామన్నారు. త్వరలో వారికి బేస్‌మెంట్ బిల్లులు చెల్లిస్తామన్నారు. గతంలో ఫొటో దిగిన స్థలంలోనే ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రతన్‌సింగ్, ఏఈ రహీం, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మైపూఫ్, పంచాయతీ కార్యదర్శి సంజీవ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

వివాద భూమిలో సెక్షన్ 164 విధింపు

ఆర్డీఓ సూచనతో తహసీల్దార్ ప్రకటన

తుర్కయంజాల్: ఇరువర్గాల ఘర్షణతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న కమ్మగూడ, తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలో బీఎన్ఎస్ఎస్ కింద సెక్షన్ 164 అమలు చేయాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కె.అనంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ప్రకటించారు. గురువారం స్థానిక కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 240, 241, 242లోని 10.09 ఎకరాల భూమి తమదంటే తమదేనని ఇరు వర్గాలు వరుసగా గొడవలకు దిగుతుండటంతో బుధవారం లా అండ్ ఆర్డర్ అదుపు తప్పినట్లు గుర్తించామని చెప్పారు. ఇలాంటి సంఘటనలు మరోసారి చోటు చేసుకునే ప్రమాదం పొంచి ఉండటంతో సెక్షన్ 164 విధించినట్లు ఆయన తెలిపారు. ప్లాట్లు, భూమి యజమానులతో పాటు, కోర్టు నుంచి ఆర్డర్ పొందిన వారు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరించారు. దీన్ని ఉల్లఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్మినేడులో వడగళ్ల వాన

ఇబ్రహీంపట్నం రూరల్: ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన గురువారం సాయంత్రం ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామంలో కురిసింది. భారీ ఉరుములతో వడగళ్లు పడగా.. ఓ ఇంటిపై పిడుగుపడి రేయిలింగ్ కూలిపోయిందని గ్రామస్తులు తెలిపారు.

నిలువ లేక.. నీరసించి

- ఉపాధి పని ప్రదేశాల్లో కనిపించని సౌకర్యాలు
- మండుటెండల్లో విలవిలల్లాడుతున్న కూలీలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



లింగంపల్లిలో కొనసాగుతున్న ఉపాధి పనులు

నవాబుపేట: పని ప్రదేశాల్లో నిలువ నీడ కరువయిందని గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలు గగ్గోలు పెడుతున్నారు. మండుటెండల్లో రెక్కలు ముక్కలు చేసుకొని పని చేస్తున్నా కనీస వసతులు లేవని వాపోతున్నారు. జిల్లాలో 1.86 లక్షల జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 23,105 మంది కూలీలు పని చేస్తున్నారు. నవాబుపేట మండలంలో 8826 జాబ్ కార్డులు ఉండగా ఆరు వేలకు పైగా కూలీలు ఉపాధి పొందుతున్నారు.

మండుటెండల్లో పనులు

ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. ఉదయం 10 గంటలు అయ్యిందంటే బయటికి వెళ్లడానికి జనాలు జంకుతున్నారు. మండలంలోని చించల్‌పేట, మమ్మదాన్‌పల్లి, ఎక్‌మామిడి, నవాబుపేట, చిట్టిగిద్ద, అక్నాపూర్ తదితర గ్రామాల్లో సుమారు 6 వేల మందిపైగా కూలీలు మండటెండల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనులు చేస్తూ అలసిపోతున్నారు. సేదతీరేందుకు ఎలాంటి సదుపాయాలు లేక అస్వస్థతకు గురవుతున్నారు.

రెండు నెలలుగా నిలిచిన వేతనాలు

ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో అందరూ ఉపాధిహామీ పనులకు వస్తున్నారు. గత జనవరిలో చేసిన పనికి మాత్రమే కూలీ డబ్బులు ఖాతాల్లో జమచేయగా.. ఫిబ్రవరి, మార్చి నెలలో పని చేసిన వాటికి డబ్బులు రాలేదని మదన పడుతున్నారు. దీనిపై ఉపాధిహామీ అధికారులు సంప్రదిస్తే.. చేసిన పనులకు సంబంధించి మస్టర్లు జనరేట్ చేసి మెమోలు జారీ చేశామని, ప్రభుత్వం కూలీల డబ్బులు విడుదల చేస్తే నేరుగా ఖాతాల్లో జమ అవుతాయని తెలుపుతున్నారు.

నిబంధనలు గాలికి

నిబంధనల ప్రకారం పనులు ఉపాధి పనుల జరుగుతున్న ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలి. ప్రాథమిక చికిత్సకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అందులో అయోడిన్, కాటన్, బ్యాండేజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. ఎండ నుంచి రక్షణ కోసం టెంట్లు వేయాలి. కానీ క్షేత్రస్థాయిలో ఇవి ఎక్కడా కనిపించవు. కూలీల పిల్లల ఆలనా పాలన కోసం ఆయాలను ఏర్పాటు చేయాలి. సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని శ్రమజీవులు ఆరోపిస్తున్నారు. రోజు వారీ వేతనం రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మమ్మదాన్‌పల్లిలో ఎండలో పని చేస్తున్న కూలీలు

కూలీ డబ్బులు రాలేదు



నాకు భర్త లేదు. కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. మండు టెండల్లో శ్రమటోడ్చి ఉపాధిహామీ పనులు చేస్తున్నా. కూలీ డబ్బులు మాత్రం సక్రమంగా రావడంలేదు. రెండు నెలల నుంచి ఒక్క రూపాయి రాలేదు. చాలా ఇబ్బందిగా ఉంది.

– అండాలు, ఉపాధి కూలీ, పూలపల్లి

ఏమీ కొనలేక పోతున్నాం



ప్రభుత్వం గ్యాస్ ధర రూ.50 పెంచింది. కానీ మండుటెండల్లో పని చేసే కూలీలకు మాత్రం రూ.7 పెంచడం ఎంతవరకు సమంజసం. రూ.7కి చాయ్ సైతం రావడం లేదు. నిత్యావసర సరుకులు కొనలేక పోతున్నాం. ఇల్లు గడవడానికి ఇబ్బందులు పడుతున్నాం.

– శంకరయ్య, ఉపాధి కూలీ, నారెగూడ

త్వరలోనే డబ్బులు వస్తాయి



ఫిబ్రవరి మొదటి వారం నుంచి వచ్చే కూలీ డబ్బులు త్వరలోనే వస్తాయి. ఉపాధిహామీ కూలీల కోసం మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు గ్రామాల్లోని ఆశవర్కర్ల వద్ద ఉంచాం. పనులు జరుగుతున్న చోటను విజిట్ చేయమని వైద్య సిబ్బందికి ఆదేశాలు ఉన్నాయి.

– అనురాధ, ఎంపీడీఓ, నవాబుపేట

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని చించల్‌పేట గ్రామంలో గురువారం సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రేషన్ షాపుల్లో పంపిణీ చేసే బియ్యాన్ని ఎవరు కూడా సక్రమంగా తినేవారు కారన్నారు. పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సన్నబియ్యం పంపిణీని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేట: చించల్‌పేటలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

సన్న బియ్యం పేదల పాలిట వరం..

దుద్యాల్: ప్రతిఒక్కరూ సన్న బువ్వ తినాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారని హస్నాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూర్పు భీములు, జిల్లా కార్యదర్శి దౌల్తాబాద్ మల్లేశ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని హస్నాబాద్‌లో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సన్న బియ్యంతో అన్నం తినాలంటే పెద్ద రైతు, ఆర్థికంగా స్థోమత ఉన్నవారే తినేవారన్నారు. పేదలు, సామాన్యులు కూడా సన్న బియ్యం వండుకుని తినాలనే ఉద్యేశ్యంతో ప్రభుత్వం అందరికీ పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ వెంకటేశ్, గ్రామస్థులు వెంకటయ్య, నరేశ్, రాజు, చంద్రప్ప, వెంకట్ ప్రసాద్, మైమూద్, నర్సిములు, వెంకటయ్య, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో పేలిన సిలిండర్

తప్పిన పెను ప్రమాదం

పహాడీషరీఫ్: స్టోర్ రూంలో ఉంచిన సిలిండర్ పేలిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఎర్రకుంట సాదత్‌నగర్‌కు చెందిన సల్మా భాను కుటుంబంతో కలిసి నివాసం ఉంటుంది. బుక్ చేసిన గ్యాస్ రావడంతో ఇంటి బాల్కానీలో ఉన్న విజిటింగ్ రూమ్‌లో ఉంచారు. ఆ సమయంలో పిల్లలు పాఠశాలకు వెళ్లడంతో సల్మా లోపలి ఇంట్లో ఉంది. అప్పటికే లీకవుతున్న గ్యాస్ ఒక్కసారిగా పేలింది. దీంతో ఇంట్లో ఉన్న సామగ్రి కాలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేని కారణంగా పెను ప్రమాదమే తప్పింది. ఇంటి పైకప్పు కూడా స్వల్పంగా ధ్వంసమయింది.



ఇంట్లో కాలిపోయిన సామగ్రి

బుల్లెట్ తీసి బతికించారు..

రెండు నెలలకు పైగా తలలో బుల్లెట్

- గచ్చిబౌలి కేర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స
- 3.5 సెంటీ మీటర్ల బుల్లెట్‌ను బయటకు తీసిన కేర్ వైద్యులు
- సురక్షితంగా బయటపడ్డ సోమాలియా యువకుడు

గచ్చిబౌలి: సోమాలియా దేశంలో జరిగిన సివిల్ వార్‌లో ఓ యువకుడికి తలలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. కోమాలోకి వెళ్లిన యుకుడికి బుల్లెట్‌ను తీసేందుకు అక్కడి వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రెండు నెలల అనంతరం రోగిని ఎయిర్ అంబులెన్స్‌లో గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. 12 గంటల పాటు శస్త్ర చికిత్స చేసిన కేర్ హాస్పిటల్ డాక్టర్ల బృందం 3.5 సెంటీ మీటర్ల పొడవు ఉన్న బుల్లెట్‌ను బయటకు తీసింది. దీంతో సదరు యువకుడు గులెమ్ మహముద్ హెర్సీ(27) ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. గురువారం కేర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు వివరాలు వెల్లడించారు. సోమాలియాకు చెందిన గులెమ్ మహమూద్ హెర్సీ అనే యువకుడికి అక్కడ జరిగిన సివిల్ వార్‌లో నుదుటి నుంచి బుల్లెట్ తలలోకి దూసుకెళ్లిందన్నారు. చిన్న మెదడు దగ్గర చేరడంతో అతడు కోమాలోకి వెళ్లాడని, అక్కడి వైద్యులు తల ముందు పుర్రె ముందు భాగం నుంచి బుల్లెట్‌ను తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందన్నారు. కోమాలోంచి కొద్దిగా కోలుకున్న తర్వాత అతడిని రెండు నెలల అనంతరం ఎయిర్ అంబులెన్స్‌లో గచ్చిబౌలి కేర్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారన్నారు. రేడియాలజీ, సిటీస్కాన్, ఎంఆర్ఐలో బుల్లెట్ పొజిషన్, లోకేషన్‌ను గుర్తించామన్నారు. న్యూరో నావిగేషన్, సర్జికల్ మైక్రో స్కోప్ ద్వారా బ్రెయిన్ ఫంక్షన్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా 12 గంటల పాటు ఆపరేషన్ చేసి బ్లీడింగ్ కాకుండా, వైటల్ స్ట్రక్చర్స్‌ను కాపాడుకుంటూ బుల్లెట్‌ను తీశామన్నారు. బ్రెయిన్ స్టెంట్ దగ్గర ఉన్న బుల్లెట్‌ను బయకు తీయడం చాలా అరుదుగా జరుగుతుంటుందన్నారు. సర్జరీ జరిగి రెండు వారాలు గడిచిందని, రోగి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. అతడిని రిహాబిలిటేషన్ సెంటర్ ఉంచామని, మరో నాలుగు వారాలు గడిస్తే మరింత కోలుకునే అవకాశం ఉందని తెలిపారు. కేర్ హాస్పిటల్స్ సీఈఓ నీలేష్ మాట్లాడుతూ ఇలాంటి క్లిష్టమైన కేసులకు అత్యాధునిక వైద్య సదుపాయాలు , నిపుణులైన వైద్యులు తమ వద్ద ఉన్నారని తెలిపారు. ఆఫ్రికా, దక్షిణ ఆసియా దేశాల నుంచి వచ్చే అందర్జాతీయ రోగులకు గమ్యస్థానంగా కేర్ హాస్పిటల్ ఉందన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు

పోలీసులను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

యాచారం: విధుల్లో ఉన్న పోలీసులను బెదిరించిన వ్యక్తిపై యాచారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని గునుగల్ గ్రామానికి చెందిన కుంటి శ్రీకాంత్ బుధవారం అర్ధరాత్రి గునుగల్ గేట్ వద్ద సిగరేట్ కాల్చుతూ అనుమానంగా తిరుగుతున్నాడు. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు వెళ్లి అతడిని విచారిస్తుండగానే తీవ్ర పదజాలంతో దూషిస్తూ బెదిరించాడు. అక్కడి నుంచి తప్పించుకొనిపోయి, ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడు. ఈ విషయమై యాచారం పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

మతిస్థిమితం లేని యువతి అదృశ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: మతిస్థిమితం లేని ఓ యువతి అదృశ్యమైన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాదర్‌గుల్ ప్రాంతానికి చెందిన బొచ్చల్ల సౌందర్య(24) అనే యువతి ఇంట్లో నుంచి తప్పిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదిబట్ల పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్ గ్రామానికి చెందిన మర్ల కృష్ణ కుమార్తె కళావతి(19) ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 9న మధ్యాహ్నం బయటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. ఆమె ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తుంది. ఆచూకీ కోసం స్థానికంగా గాలించినా ఫలితం లేకుండా పోయింది. మన్సూర్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ కృష్ణ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. యువతి ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

15న స్త్రీ సమ్మిట్ 2.0

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మహిళల భద్రతను మరింత పెంచడమే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌తో (హెచ్‌సీఎస్‌సీ) కలిసి సిటీ పోలీసులు 'స్త్రీ' (షీ ట్రంప్స్ థ్రూ రెస్పెక్ట్, ఈ క్వాలిటీ అండ్ ఎంపవర్‌మెంట్) పేరుతో మరోసారి సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 2023లో ఓసారి ఈ సదస్సు నిర్వహించారు. ఈ నెల 15న నిర్వహించనున్న రెండో సమ్మిట్‌కు సంబంధించిన లోగోను కొత్వాల్ సీవీ ఆనంద్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వివిధ వర్గాలకు చెందిన మహిళలు, యువతులతో పాటు నిపుణులు ఈ సమ్మేళనంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు సలహాలు, సూచనలు ఇస్తారు.

రాజ్యాంగం మార్పునకు కుట్ర

- బడాబాబుల కోసమే బీజేపీ ప్రభుత్వం
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణ కేంద్రంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సవరణ పేరిట చేస్తున్న ప్రయత్నాలు రిజర్వేషన్లకు ముప్పు తీసుకురావడమే లక్ష్యంగా కనిపిస్తుందన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఎంతో శ్రమకూర్చి రచించిన రాజ్యాంగంతోనే బడుగు బలహీన వర్గాలకు ప్రయోజనాలు దక్కుతున్నాయన్నారు. దేశంలోని పెద్ద కుబేరాల కోసం కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తుందన్నారు. పదేళ్ల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ దేశ ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టి ఐక్యంగా ఉన్న ప్రజలు రెచ్చగొట్టి విడగొడుతుందని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పాటు పడుతున్న కాంగ్రెస్‌కు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆయూబ్, ఆలయ కమిటీ చైర్మన్ పార్థసారథి, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు పాలాద్రి శ్రీను, బాదం శ్రీను, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

వరంగల్ సభను విజయవంతం చేద్దాం

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్

అనంతగిరి: భారత్ రాష్ట్ర సమితి వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం వికారాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి ఈ నెల 27 నాటికి 25 ఏళ్లు కావొస్తున్న శుభ తరుణంలో వరంగల్‌లో నిర్వహించబోయే సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. సమావేశానికి జిల్లా నుంచి 200 వరకు ప్రత్యేక బస్సులు, సొంత వాహనాలలో బయలుదేరాలని సూచించారు. సభ జరిగే రోజు ఉదయమే జిల్లాలోని అన్ని పంచాయతీలు, వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేయాలని ప్రకటించారు. అనంతరం రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, టీఎస్‌ఈడబ్ల్యూడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్, రాజుగౌడ్, రాంరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు, ఎంపీపీలు, వర్కింగ్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్

కేంద్ర పథకాలపై ప్రచారం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న సదానందరెడ్డి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి

పరిగి: రాష్ట్ర ప్రజలకు కేంద్రం అందిస్తున్న సంక్షేమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి సూచించారు. గురువారం పట్టణ కేంద్రంలో పార్టీ క్రియాశీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తుందన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో కేంద్రం వాటా ఉందన్నారు. వాజ్‌పేయ్ శతజయంతి ఉత్సవాలను ప్రతి పల్లెలో ఘనంగా నిర్వహించాలని సూచించారు. అందులో భాగంగా గావ్ చలో గల్ చలో కార్యక్రమం ఉంటుందన్నారు. పార్టీ ఇచ్చినటువంటి తొమ్మిది కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. గ్రామంలో స్వచ్ఛ భారత్, దళితవాడలో భోజనం, మాజీ సైనికులకు సన్మానం, వివిధ కుల పెద్దలను కలవడం, జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేయడం, డా.బీఆర్.అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, అసెంబ్లీ కన్వీనర్ నరసింహ, పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు హరికృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూమిలో నిర్మాణాలు



జల్‌పల్లి చెరువు శిఖం భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలు

రాత్రిపూట పనులు చేస్తున్న అక్రమార్కులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. 69 సర్వే నంబర్ పరిధిలోకి వచ్చే ఈ భూమిపై ఎప్పటి నుంచో కన్నేసిన కబ్జాదారులు గతంలో ప్రహరీలు నిర్మించేందుకు యత్నించారు. అప్పట్లో బాలాపూర్ రెవెన్యూ అధికారులు స్పందించి కూల్చివేతలు చేపట్టారు. తాజాగా సెలవులు రావడంతో ఇదే అదునుగా భావించి మూడు భారీ ప్రహరీల నిర్మాణ పనులు చేపడుతున్నారు. రాత్రికి రాత్రే ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. చెరువులో నీరు తగ్గుముఖం పడుతున్నప్పుడు ఇలాంటి నిర్మాణాలు చేపట్టి, చివరకు తటాకం నిండినప్పుడు తమ నిర్మాణాలు మునిగిపోయాయంటూ గగ్గోలు పెట్టడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఉస్మాన్‌నగర్‌లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమై, ప్రజావసరాల కోసం ఏదైనా కమ్యూనిటీ హాల్, క్రీడా మైదానం లాంటివి నిర్మించడానికి కూడా స్థలం దొరకని పరిస్థితులు జల్‌పల్లి మున్సిపాలిటీలో దాపురించాయి. అక్కడక్కడ మిగిలిన కొద్దిపాటి ప్రభుత్వ భూములనైనా కబ్జా బారిన పడకుండా రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మరోసారి రణరంగం

- శాంతి భద్రతలకు విఘాతంగా పిట్టలగూడ భూవివాదాలు
- పెద్దఎత్తున గుమిగూడి కర్రలతో కొట్టుకున్న ఇరువర్గాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పిట్టలగూడలోని భూములు వివాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. నిజాం నవాబుల హయాంలో నక్కలోళ్లు, పిట్టలోళ్లకు ఇనామ్ కింద ఇచ్చిన వందల ఎకరాల భూముల విషయంలో తరచూ నెలకొంటున్న వివాదాలు శాంతి భద్రతలకు విఘాతంగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ భూములలో బుధవారం సాయంత్రం రెండు గ్రూప్‌లు పెద్ద ఎత్తున గుమిగూడి బాహాబాహీకి దిగారు. కర్రలు, పైపులు, చేతికి దొరికిందానితో ఆడ, మగ అని తేడా లేకుండా దాడులు చేసుకొని ఈ ప్రాంతాన్ని రణరంగంగా మార్చారు. దాడికి పాల్పడిన వారిపై పహాడీషరీఫ్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఒకే ప్లాటు పలువురికి విక్రయాలు

జల్‌పల్లి నుంచి గగన్‌పహాడ్‌కు వెళ్లే రూట్‌లో ఉన్న పిట్టలగూడెంలో రోడ్డుకు ఎడమవైపు ఉన్న సమాధుల స్థలాన్ని ఇప్పటికే పెద్ద ఎత్తున విక్రయాలు చేపట్టారు. పార్టీ కులస్తులలోని కొందరు నాయకులుగా చలామణి అవుతూ గ్రూప్‌లుగా విడిపోయి ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. ఒక గ్రూప్ విక్రయించిన భూమిని కొన్నవారు పొజిషన్‌లోకి వచ్చాక, మరో గ్రూప్ రంగంలోకి దిగుతుంది. ఈ భూమి తమదంటూ, మీకంటే ముందే తాము కొనుగోలు చేశామంటూ గొడవలకు దిగుతుంటారు. చివరకు పోలీస్‌స్టేషన్, కోర్టుల దాక వెళుతున్నారు. గత రెండు నెలల క్రితం ఇదే వివాదాస్పద భూమిలో రాత్రికి రాత్రే పెద్ద ఎత్తున ప్రీ కాస్ట్ వాల్‌ను నిర్మించారు. ఈ స్థలం తమదంటూ బుధవారం సాయంత్రం అక్కడికి చేరుకున్న 40–50 మంది వాల్‌ను కూల్చివేయడంతో గొడవ మొదలయ్యింది.

మాయమవుతున్న సమాధులు

రోడ్డుకు ఎడమవైపు పెద్ద ఎత్తున ఉన్న స్థలాన్ని సమాధులతో సహా కొంత మంది విక్రయాలు చేపడుతున్నారు. ఈ స్థలాలను కొనుగోలు చేసిన వారు వెంటనే చుట్టూ ప్రహరీ నిర్మించుకోవడం... ఆపై లోపల ఉన్న సమాధులను తొలగించి, భూమిని చదును చేసి ప్లాట్లుగా మార్చి విక్రయాలు జరుపుతున్నారు. ఇలా వందల గోరీలు ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోయాయి. ప్రతి ఏటా నక్కల పిట్టలోళ్లు తమ పూర్వీకుల సమాధులకు హోలీ సందర్భంగా నగరం నలుమూలల నుంచి తరలివచ్చి పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తారు. సమాధులను అంత పవిత్రంగా చూసుకునే సంప్రదాయం ఉన్నప్పటికీ, కొందరు స్వార్థపూరితంగా వాటిని అమ్ముకోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక తరచూ కొనసాగుతున్న వీరి గొడవలతో తమ గ్రామానికి చెడ్డ పేరు వస్తుందని జల్‌పల్లి గ్రామస్తులు మండిపడుతున్నారు. విచారణ జరపాలని కోరుతున్నారు.